

# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



## *తెనాలి రామకృష్ణ - 6*

రాయలు -- భువనవిజయం గోష్ఠిలో——

“కుంజరయూథంబు దోమకుత్తుకఁ జొచ్చెన్”

ఈ సమస్యనే మేమిస్తున్నాం. పూరించండి రామకృష్ణయ్యగారూ--

రామకృష్ణ కవి:

రంజనచెడి పాండవులరి
భంజనులై విరటుగొల్వ పాల్పడిరకటా।
సంజయా విధినేమందును
కుంజరయూథంబు దోమకుత్తుకఁ జొచ్చెన్॥

రాయలు : నీ బుద్ధికి రెండు ప్రక్కలా పదునే రామకృష్ణయ్యా. -- రాజు సైగతో కవికి బహుమానాలు.

★★★ తాతాచార్యుల కాళ్ళుపిసుకుతూ అప్పలాచార్యులు : ‘ఎగిరితంతే బూరెలబుట్టలో పడ్డాడట’. ఈ దెబ్బతోనైనా వదులుతాడనుకుంటే, ఈ రామకృష్ణుడు పైకి వెళ్ళిపోతున్నాడేమిటి స్వామీ?

తాతా: వాడంత తేలిగ్గాపోడురా.

అప్పల : పోడూ- ఒంటరిగా చూసి ఎప్పుడైనా——బలంగా కసిగా కాళ్ళు ఒత్తుతాడు.

తాతా: అబ్బబ్బ. చంపేస్తున్నావురా.

అప్పల-అదే moodలో: చంపెయ్యక వదుల్తానా? మీరూరుకోండి.

తాతా: అప్రాచ్యుడా. కాలు  విరిచేశావురా.

అప్పల: అపచారం- అపచారం. క్షమించండి. కాలు అనుకోలేదు. ‘వాడు’ అనుకున్నాను.

ప్రతీహారి: నమస్కారం. గురుస్వామీ.

తాతా:ఏం నాయనా?

ప్రతీ : కాశీనుండి ఎవరో వ్యాకరణ పండితులు దయచేశారు స్వామీ. రేపుదయం సభలో వారితో వాదించాలట. ప్రభువులవారు తమతో మనవిచేసి రమ్మన్నారు.

తాతా : సరే... అప్పన్నా...

అప్పల : విన్నాను స్వామీ.

తాతా : ఏం విన్నావు?

అప్పల: తమరు రేపు ఆ కాశీ పండితుని ఢీకొంటారనిన్నీ, వాగ్యుద్ధంలో శత్రువు మాడు వాయగొడతారనిన్నీ...

తాతా: నీ మొహమనిన్నీ. నోర్ముయ్. నీ బుద్ధిలో దద్ధోజనంపట్టేగాని, పులిహోర ప్రభావం రవంతైనాకూడా కనిపించలేదురా.

అప్పల: అలా శలవిచ్చారేమిటి స్వామీ?

తాతా: ఎదటివాడి దిట్టతనం తెలియకుండా ఎదిరిస్తే జయాపజయాలు ఎవరివో? వచ్చినవాడు ఉద్దండుడంటున్నారు. వానికి రామకృష్ణుని ఎరవెయ్యాలి. వాడు గెలిచాడా ఒక లింగడు చస్తాడు.

అప్పల : బతికాడా?

తాతా: అపశకునపక్షీ. వీడు గెలవలేదురా. వీడికి నాలుగు తెలుగుముక్కల గొప్పేగాని, పాండిత్యమెక్కడిది?

అప్పల : ఐతే తప్పక ఓడిపోతాడు స్వామీ.

తాతా: అందుకేవెళ్ళి రామకృష్ణుణ్ణి ఒప్పించిరా.

అప్పల: క్షణంలో... ★★★

అప్పల : అయ్యా రామకృష్ణయ్యగారూ. మహాకవులకి నమస్కారాలు.

కవి : ఓహో మీరా? దయచెయ్యండి. దయచెయ్యండి. ఇలా వేంచేశారేం?

అప్పల : గురువులవారు పంపారు.

రా.కృ.: కారణంలేకుండా పంపరే?

అప్పల: ఔను. సకారణంగానే పంపారు. కాశీనుండి జగద్విఖ్యాతిగాంచిన మహాపండితుడొకాయన వచ్చాడు. వైయాకరణి. ఆయన అల్లాంటీలాంటివాడు కాదండోయ్. ఆయన చూడనిది లేదు దేవుడు తప్ప. విననిదిలేదు గంధర్వగానం తప్ప. తెలియనిదిలేదు స్వర్గం తప్ప.

కవి : త్రాగనిదిలేదు విషంతప్ప. చేయనిదిలేదు హత్యతప్ప——అందురూ.

అప్పల : అహహఁ. –కాదు.అసలు విషయం తమకింకా తెలిసిందికాదు.

కవి : అబ్బే. మీరుచెప్పారుకాదు.

అప్పల : అతడిని వాదంలో ఓడించి వచ్చినదారినే పంపించాలి.

కవి : అందుకు ఆస్థానంలో చాలామంది ఉన్నారుగా?

అప్పల: ఉన్నారు––లేరు. ఎందుకు నేనూ ఉన్నాను.

కవి(కొంటెగా) : మీ గురుస్వాములూ ఉన్నారే?

అప్పల : ఉన్నారు. మతవిషయికమైన చర్చ వచ్చినట్లయితే మాడువాయగొట్టేవారే. (కవి తల పంకిస్తాడు) వ్యాకరణం అయింది. కొంచెం వెనకాడుతున్నారు.

కవి : పోనీ గజాలు ఉన్నాయిగా? వదలండి.

అప్పల : గజాలు అడుగులు కదల్చలేకుండా ఉన్నాయి.

కవి : ఊఁ.

అప్పల : ఆఁ. అందుకనే సింహం దగ్గరికి వచ్చాం. అంతటి మహాపండితుణ్ణి జయించాలంటే తమరొక్కరే సమర్థులు. సంగీతసాహిత్యాల్లో ఐతేనేమి, తర్కజ్యోతిష మీమంసాదులు–ఒకటేమిటి సమస్త విషయాల్లోను... ఆహా–తమకుతమరేసాటి.

కవి: అని ఎవరన్నారు?

అప్పల : ఒకరేమీటి? లోకం కోడై కూస్తున్నది. సాక్షాత్తు మన గురువులవారే సాయించారు.

కవి: ఆచార్యులవారికి నామీద అంత అనుగ్రహం ఉన్నదన్నమాట!

అప్పల: ఉన్నది. ఉన్నదిగనుకనే అంతటి మహాపండితుని జయించేటటువంటి సత్కీర్తి దక్కాలని శ్రీ శ్రీ శ్రీ స్వాములవారి తిరువనం.

కవి : చాలా సంతోషం. సరే అన్నానని మనవి చెయ్యండి.

అప్పల (ఆశ్చర్యంగా) : ఆఁ. చిత్తం. సంతోషం. సంతోషం. విజయనగర ఆస్థాన ప్రతిష్ఠ నిలబెట్టారు. జయీభవ. దిగ్విజయీభవ. —నిష్క్రమిస్తాడు.

కవి  విరగబడి నవ్వుతాడు.

★★★

(సశేషం)

COMMENTS